


## చిన్నమాట

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజిలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో ఆ950-ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

## గుడ్డివాళ్ళ రాజ్యం

## (రచన: 1904లో ది స్ట్రాండ్ పత్రికలో హెచ్.జి.వెల్స్ రాసిన కథ)

**ఇబారా ఈక్వెడార్లోని** క్వోటోలో మైనింగ్ ఇంజనీర్. అతనికి పర్వతారోహణ చాలా ఇష్టమైన వినోదం. ఏండిస్‌లో అంతదాకా ఏ మనిషీ ఓడించని, సముద్రమట్టానికి ఇరవైవేల అడుగులు ఎత్తున ఉన్న ఏండిస్ పర్వత శిఖరం ఎక్కాలని ఇబారా ఏడాది క్రితం అక్కడకి వెళ్ళాడు. అతని స్థానిక గైడ్ వాన్ నూనెజ్. ఇద్దరూ పదివేల అడుగులు ఎక్కాక నూనెజ్ ప్రమాదవశాత్తూ కింద లోయలోకి పడిపోయాడు.

క్షేమంగా తిరిగొచ్చినా ఇబారా మళ్ళీ దాన్ని ఎక్కే ధైర్యం చేయలేదు.

ఆ రోజు సాయంత్రం గని నించి తన బసకి తిరిగొచ్చిన ఇబారాకి, చిరిగి, మాసిన దుస్తుల్లో దేశదిమ్మరిలా కనిపించే అతను అరుగు మీద కూర్చుని కనిపించాడు.

"ఎవరు మీరు?" అడిగాడు.

"ఇబారా! నన్ను గుర్తుపట్టారా?" అతౌ అడిగాడు.

ఆ కంఠం ఇబారాకి సుపరిచతం.

"నువ్వు..నువ్వు.." ఆగిపోయాడు.

"నేనే సెన్యూర్. నూనెజ్‌ని."

"అదేమిటి? నువ్వు లోయలోకి పడటం నేను చూసాను. అంత ఎత్తులోంచి వేల అడుగుల కిందకి పడ్డా నువ్వు మరణించలేదా?" ఇబారా ఆశ్చర్యంగా అడిగాడు.

"బహుశ ఆ పర్వతదేవతలు నన్నేం చేయకుండా వదలడానికో కారణం ఉందనుకుంటాను. నేను చెప్పేది మీరు నమ్మలేరు. నేను పడ్డ రాత్రి మీకు గుర్తుందా? నూనెజ్ అడిగాడు.

"గుర్తుంది."

"నేను మిమ్మల్ని పైదాకా తీసుకెళ్ళలేను సెన్యూర్ ఇబార్. పర్వత దేవతలని నమ్మే స్థానికులు మనం ఉన్న ప్రదేశం మనిషికి నిషేధించబడ్డ చోటు అని చెప్తూంటారు. అకస్మాత్తుగా నాలో మునుపు లేని భయం ప్రవేశించింది." మంచు పేరుకున్న ఆ కొండకి ఓ పార్శ్వంలో తవ్విన చిన్న చోటులో ఇద్దరూ కూర్చుని ఉండగా నూనెజ్ చెప్పాడు.

"ఇంతదాకా ఏ పర్వతారోహకుడూ దీన్ని ఎక్కలేదు. అందువల్ల ఈ మూఢనమ్మకం ఏర్పడి ఉంటుంది. ఇక్కడెక్కడో కింద గుడ్డి వాళ్ళదేశం ఉందని విన్నాను. ఓ భూకంపం వల్ల కొండరాళ్ళు కిందకి జారి వాళ్ళని అక్కడ నించి బయటకి రాఖుండా బంధించాయని కూడా విన్నాను" ఇబారా చెప్పాడు.

"అవును. ఆనాటి స్పానిష్ రాజుల నియంతృత్వాన్ని భరించలేక కొందరు వచ్చి ఓ కొండ లోయలో స్థిరపడ్డారని, అక్కడి ప్రజలకి ఏదో వింత జబ్బొచ్చి అంతా క్రమంగా గుడ్డివాళ్ళయ్యారని, వారికి పుట్టే పిల్లలు కూడా గుడ్డివారేనని నేనూ

విన్నాను. దాంతో వారి మిగిలిన జ్ఞానేంద్రియాలు బాగా పని చేస్తాయి. వారు దృష్టిలేకుండా జీవించగలగడాన్ని అలవాటు చేసుకున్నారు. అది కొండదేవతలు ఉండే అందమైన లోయ. దాన్ని మనిషి చూడకూడదని అలా జరిగిందని మా పూర్వీకులు చెప్పగా విన్నాను. పాత సామెతొకటి విన్నారా సెన్యూర్? గుడ్డివాళ్ళ రాజ్యంలో ఒంటికంటివాడే రాజు" నూనెజ్ చెప్పాడు.

"అసలా దేశం ఉందని నేను నమ్మను. ఉన్నా దాన్ని మనం కనుక్కోవడం అసాధ్యమని నా అభిప్రాయం" ఇబారా చెప్పాడు.

అకస్మాత్తుగా నూనెజ్ పెద్దగా అరుస్తూ కిందకి జారిపోయాడు. కిందకి పడిపోయే అతన్ని పట్టుకోవాలని ఇబారా ప్రయత్నించాడు. కాని అతని చెయ్యి అందలేదు. వెన్నెల వెలుగులో వేల అడుగుల కిందకి పడిపోయే నూనెజ్ ఆకారం క్రమంగా దూరమై మాయమైపోయింది.

"అలా నేను కొన్ని వేల అడుగులు కిందకి జారాక దూదిలాంటి మంచులో పడటంతో ప్రాణాంతక దెబ్బలేం తగల్లేదు. అక్కడనించి నేను కిందకి జారి క్రమంగా ఆ కొండపాదం దగ్గరి నేలని చేరాను. మర్నాడు ఉదయం నిద్రలేచాక నాకు అంటిన మంచుని దులుపుకుని తల పైకెత్తి చూసాను. పదివేల అడుగులకి పైగా ఎత్తున్న ఏండిస్ పర్వత శిఖరం కనిపించింది. నా బట్టలు చిరిగి, శరీరం దోక్కుపోయిన చోట రక్తం గడ్డకట్టింది. అదృష్టవశాత్తు ఒక్క ఎముక కూడా విరగకపోవడంతో నేను కొండ దేవతలకి నమస్కరించాను. ఉదయపు ఎండలో నాకు చుట్టూ ఆకుపచ్చటి చెట్లు కనిపించాయి. నేను ముందుకి సాగేకొద్దీ అక్కడ ప్రకృతి ఎంత అందంగా ఉందో అర్థమైంది. నేను మరుగున ఉన్న స్వర్గాన్ని చేరుకున్నానా అనిపించింది. దాన్ని చూసిన మొదటి మనిషి నేనే అనుకున్నాను. కాని తప్పు. నేలమీద నడిచేందుకు పరచిన రాళ్ళని చూసాను. వాళ్ళని కూడా. చెట్లకింద పడుకుని వాళ్ళు విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆ గ్రామంలో కిటికీలు లేని గుడిసెలు చాలా కనిపించాయి. ప్లాస్టింగ్ చేసిన ఆ ఇళ్ళ బయటి భాగాలని చూసి ఆ పని చేసినవారెవరో కాని గుడ్డివాళ్ళై ఉంటారు అనుకున్నాను. అప్పుడు నేను సమీపంలో చిన్న వాగుమీది వంతెన మీద నిలబడ్డ ఇద్దర్ని చూసి వారి దగ్గరకి వెళ్ళాను. వాళ్ళు నేను గట్టిగా మాట్లాడేదాకా నన్ను గమనించలేదు."

నూనెజ్ చెప్పేది ఇబారా ఆసక్తిగా వింటున్నాడు.

వాళ్ళు తనవైపు తిరగ్గానే నూనెజ్ వారివంక భయంగా చూసాడు. వారి కళ్ళు లోతుకుపోయాయి. కనుగుడ్లు లేవు. రెప్పలు చాలా చిన్నగా ఉన్నాయి. వాళ్ళు గుడ్డివాళ్ళని గ్రహించాక తను గుడ్డివాళ్ళ దేశంలోకి వచ్చాడా అని నూనెజ్ అనుకున్నాడు.

"హలో. నేను శాంతి కోసం వచ్చాను తప్ప ద్వేషంతో రాలేదు" చెప్పాడు.

"పెడ్రో అతను ఎవరు? మగాడా?" ఒకడు అడిగాడు.

"అవును. రాళ్ళవైపు నించి వచ్చాడు" పెడ్రో ఆశ్చర్యంగా జవాబు చెప్పాడు.

"అవును. నేను పైనించి మీ లోయలోకి పడ్డాను. ఇక్కడికి ప్రాణాలతో చేరుకున్నాను" నూనెజ్ చెప్పాడు.

"లోయా? అంటే?"

పెడ్రో అతని దగ్గరకి వెళ్ళి చేతిని, మొహాన్ని, ఒంటిని తడిమాడు.

"నేను కూడా మీలాంటి మనిషినే. జాగ్రత్త. అవి నాకళ్ళు" పెడ్రో వేళ్ళు తన కంటిని తడుముతూంటే చెప్పాడు.

"కళ్ళు? కళ్ళు? వింతగా ఉంది. అవి సరిగ్గా ఏర్పడలేదు. బయటకి వచ్చాయి" పెడ్రో చెప్పాడు.

"కాదు. మీ కళ్ళు లోతుకి పోయాయి. కనుగుడ్లు కూడా పూర్తిగా ఏర్పడలేదు. కాని నావి బయటకి ఉన్నాయి. నా కనుగుడ్లు చక్కగా ఏర్పడటంతో చూడగలుగుతున్నాను" నూనెజ్ చెప్పాడు.

"చూడటమా? పెడ్రో. ఇతను ఎక్కడనించి వచ్చాడు? ఏమిటా వింతమాటలు?" రెండో వ్యక్తి ప్రశ్నించాడు.

"ఆ కొండ వెనకున్న బగోటా దేశం నించి. అక్కడ లక్షలమందికి పైగా నివశిస్తున్నారు. కొండ అడ్డం ఉండటంతో మీరు వాళ్ళని చూడలేరు."

"చూడటమా? అర్థం, పర్థం లేని వింతమాటలు మాట్లాడుతున్నావు పద."

వాళ్ళు వంతెనని దాటుతూంటే నూనెజ్ చూసుకోకుండా దారిలోని నీళ్ళ బక్కెట్‌ని తన్ని చెప్పాడు.

"సారీ. చూసుకోలేదు."

"చూసుకోలేదు? అంటే? ఇతని పంచేంద్రియాలు ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందలేదు. తట్టుకుంటాడు. అర్థంలేని మాటలు మాట్లాడతాడు పెడ్రో" రెండోవాడు నవ్వుతూ చెప్పాడు.

వాళ్ళు కొన్ని శతాబ్దాలుగా గుడ్డివాళ్ళు. చూడటానికి సంబంధించిన పదాలని వాళ్ళు మర్చిపోయారని, తననో మూర్ఖుడిగా భావిస్తున్నారని నూనెజ్ అనుకున్నాడు.

వాళ్ళ వెంట ఓ చీకటి గుడిసెలోకి వెళ్ళాక మళ్ళీ దేనికో అతని కాలు కొట్టుకోగానే ఓ ఆడపిల్ల నవ్వు వినిపించింది.

"సారీ. చీకట్లో నేను చూడలేదు" చెప్పాడు.

"ఇతను ఏమంటున్నాడు?" ఓ ముసలాయన కంఠం వినిపించింది.

"ఇతను రాళ్ళవెనక నించి వచ్చాడు ఫాదర్. నడుస్తూ అన్నిటికీ తట్టుకుంటూంటాడు. అర్థంలేని మాటలని మాట్లాడుతున్నాడు." పెడ్రో చెప్పాడు.

"అర్థంలేని మాటలు కావవి. నేను ఆ పర్వతం వెనక బొగోటా నించి వచ్చాను" నూనెజ్ వివరించాడు.

"బగోటా? అర్థంలేని మాట. ఇతని మెదడు ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందినట్లు లేదు. అందుకే అర్థంలేని మాటలని మాట్లాడుతున్నాడు. బగోటా. ఇతని పేరు బగోటా" ఫాదర్ నవ్వుతూ చెప్పాడు.

"నేను కళ్ళుండి చూడగలిగే ప్రపంచం నించి వచ్చాను. చూడగలిగే ప్రపంచం నించి" రెండో వాక్యాన్ని నూనెజ్ నొక్కి చెప్పాడు.

"ఇతనికి చాలా బోధించాలి" ఫాదర్ చెప్పాడు.

"మీకు అర్థం కాలేదు. నేను చూడగలను. కానీ చీకట్లో కాదు. మీకు చీకటి, వెలుగులు ఒకటే. కళ్ళున్నవారికి అలాకాదు. పర్వతం అవతల వారంతా చూడగలరు.

"పర్వతాలు? పర్వతాలేమిటి?" ఆ ముసలాయన ప్రశ్నించాడు.

"ఆ రాళ్ళ వెనక ఉన్న ఎత్తైన కొండ."

"ఆ రాళ్ళ వెనకది? ప్రపంచం అంతమయ్యేది ఆ రాళ్ళ దగ్గరే" ఫాదర్ చెప్పాడు.

"కాని మీరు అర్థం చేసుకోవాలి. ఆకాశం కేవలం ఈ లోయపైనే లేదు."

"ఆకాశం? అంటే?

"మనపైన ఆకాశం ఉంది. అది నీలం రంగులో ఉంటుంది."

"నీలం రంగు? పైన రాతికప్పు తప్ప ఇంకేం లేదు. సరే ఇతన్ని తీసుకెళ్ళి భోజనం పెట్టండి. మరోసారి అతను నా కూతుర్ని తొక్కుకుంటూ వెళ్ళకుండా చూడండి" ఆయన ఆజ్ఞాపించాడు.

"అతనికి నేనే మార్గదర్శిగా ఉండి భోజనం పెడతాను ఫాదర్" ఇందాక నవ్విన ఆడగొంతు చెప్పింది.

"సరే"

"రా. నే చేతిని పట్టుకో" ఆమె నూనెజ్ చేతిని పట్టుకుని చెప్పింది.

ఈ చీకట్లోంచి వెలుతురులోకి వెళ్ళడం ఆనందం" నూనెజ్ చెప్పాడు.

ఇద్దరూ బయటకి వచ్చాక ఆమెని చూసాడు. చక్కటి శరీరసౌష్టవంతో అందంగా ఉంది. కానీ ఆమె కళ్ళు కూడా మిగిలిన ఇద్దరి కళ్ళలానే ఉన్నాయి.

"నీ పేరేమిటి?" అడిగాడు.

"డయానా సరోతి"

"నా పేరు వన్ నూనెజ్. నీలాంటి అందగత్తెని నేను ఎక్కడా చూడలేదు."

"అందగత్తె? జాగ్రత్త. ఇలాంటి వింత పదాలు మాట్లాడక. వాళ్ళు దయగలవారు. వాళ్ళకి కోపం రావడం మంచిది కాదు. నిన్ను నాశనం చేయచ్చు."

అతనికి కొంత భయం కలిగినా ఆ సామెత గుర్తుకు వచ్చింది. తనకున్న దృష్టి అనే చక్కటి బహుమతి గురించి వారికి అర్థం కాదు అనుకున్నాడు.

క్రమంగా నూనెజ్ వారి మధ్య స్థిరపడ్డాడు. కానీ ఒకోసారి వారి చర్యలకి అతనికి కోపం వస్తూంటుంది. అంతా అతన్ని బగోటా అని పిలవసాగారు.

"బగోటా. గడ్డిమీద నడవకూడదు" ఓ రోజు పెడ్రో హెచ్చరించాడు.

"నేను గడ్డిమీద నడిచానని నీకెలా తెలుసు?" నూనెజ్ అడిగాడు.

"చప్పుడు విన్నాను. నువ్వు నా పాదాల చప్పుడు వింటూ నా వెనక నడు. వినడంలో నువ్వు చాలా నేర్చుకోవాల్సి ఉంది."

"నేను నిన్ను అనుసరించాలా? గుడ్డివాళ్ళ దేశంలో ఒంటి కంటివాడు రాజని నువ్వు వినలేదా?" నూనెజ్ అరిచాడు.

"గుడ్డివాడు? అంటే? బగోటా నోరు మూసుకుని నేర్చుకో. ఈ పిచ్చిమాటలు మాట్లాడటం నీకు మంచిదికాదు" పెడ్రో తీవ్రంగా చెప్పాడు.

"మీకు కంటి చూపంటే ఏమిటో అర్థం కావడంలేదు. నేను నిన్ను కొట్టగలను. కానీ నువ్వు దెబ్బతినేదాకా అది తెలుసుకోలేవు. అదే గుడ్డివాడు కాకపోవడం" వారితో విసిగిపోయిన నూనెజ్ అరిచాడు.

"బగోటా!శాంతి. హింస వద్దు. ఆ పారని కిందపెట్టి గడ్డిమీంచి నా దగ్గరకి రా" పెడ్రో అతనివైపు నడుస్తూ ఆజ్ఞాపించాడు.

"నా దగ్గరకి రాకు. నేను నీకన్నా ఉన్నతుడినని నీకు అర్థం కావడంలేదు. నువ్వు గుడ్డివాడివి. నేను చూడగలను." నూనెజ్ ఉద్రేకంగా అరిచాడు.

"ఆ పారని కింద ఉంచమన్నానా?" పెడ్రో అరిచాడు.

తన దగ్గరకి వచ్చిన పెడ్రోని పారతో కొట్టి చెప్పాడు.

"ఇదీ కంటి చూపు లేకపోవడమంటే."

అతను కిందపడగానే తను ఎటునించి వచ్చాడో అటువైపున్న రాళ్ళవైపు పరిగెత్తాడు. కానీ దాన్ని ఎక్కి పైకి వెళ్ళలేకపోయాడు. రెండు పగళ్ళు, రాత్రులు అక్కడే గడిపాడు. ఆకలి. చలి. నీరసం. తన జీవితం ఆ లోయలో అంతం అవాల్సిందే అనుకోగానే ఏడుపు తన్నుకు వచ్చింది. చివరికి తను అక్కడ చిక్కుకున్నాడు. నిగ్రహించుకున్నాక తిరిగి ఆ గ్రామానికి చేరుకున్నాడు.

"బగోటా ఇంకా నువ్వు చూడగలనని చెప్తున్నావా?"తన ముందు ప్రవేశపెట్టబడ్డ నూనెజ్‌ని ఫాదర్ అడిగాడు.

"లేదు."

"మన పైన ఏముంది?"

"రాతి కప్పు."

"మంచిది. రాళ్ళ అవతలి వైపు?"

"ప్రపంచం అంతమవుతుంది. ఇంకే ప్రశ్నలైనా అడిగే ముందు నాకు తినడానికి ఏమైనా ఇవ్వండి. లేదా ఆకలితో చచ్చిపోతాను" నూనెజ్ అర్థించాడు.

"సరే. దారిలోకి వస్తున్నాడు. కానీ ఇంకా చాలా నేర్చుకోవాలి. ఇతనికి భోజనం పెట్టండి. ఆ తర్వాత మన గ్రామంలోని అతి హీనమైన పనిని ఇతనికి ఇవ్వండి" ఫాదర్ చెప్పాడు.

"నువ్వు తిరిగి వచ్చినందుకు నాకు సంతోషంగా ఉంది" భోజనం పెట్టాక సరోతి చెప్పింది.

"నిజంగా? వీళ్ళంతా నీలాంటి వాళ్ళైతే నేనసలు పారిపోయేవాడినే కాను" నూనెజ్ చెప్పాడు.

"మొదటి రోజు నేను ఎలా ఉన్నానని చెప్పావు?" అడిగింది.

"అందంగా. నీ కళ్ళు కూడా మిగిలిన వారి కళ్ళకన్నా అందంగా ఉన్నాయి. చెప్పు. నీకు పెళ్ళెందుకు కాలేదు?" అడిగాడు.

"నాకిక్కడ అందవిహీనంగా ఉంది" తన కనురెప్పలని చూపిస్తూ చెప్పింది.

"కానీ నీ కనురెప్పలు చాలా అందంగా ఉన్నాయి. విసినకర్రల్లా."

"లేదు. ఇది పుట్టుకతో వచ్చిన అవకరంగా అంతా భావిస్తారు" ఆమె విచారంగా చెప్పింది.

"ఈ లోయలోని అందరికన్నా నువ్వు అందగత్తెవి. అది వారికి తెలీదు. నీకో ప్రియుడున్నాడా?"

"లేదు."

"నువ్వు కూడా నన్ను మిగిలినవారిలా మూర్ఖుడిగా భావిస్తున్నావా?"

"లేదు. కానీ నువ్వింకా చాలా నేర్చుకోవాల్సి ఉంది. నువ్వు మృదువుగా ఉంటావు. దయగా కూడా, ఇంతదాకా ఇలాంటి మాటలు ఎవరూ నాతో చెప్పలేదు."

"ఐతె తరచు నీతో అలా మాట్లాడుతూంటాను. ఈ లోయలోకి నేను వచ్చింది నీకోసమే అనిపిస్తోంది సరోతీ" నూనెజ్ చెప్పాడు.

అతను ఆ గ్రామపెద్ద కూతురితో ప్రేమలో పడ్డాడు. ఆమె ముందే తన మనసు విప్పి మాట్లాడగలిగాడు. చుట్టూ కనపడే అందాలని ఆమెకే వివరించసాగాడు. ఆకుపచ్చరంగు గడ్డి, పసుపు పచ్చరంగు ఎండ, రంగురంగుల పూలు, రాత్రిళ్ళు ఆకాశంలో వెలిగే వజ్రాల లాంటి నక్షత్రాల గురించి చెప్తూండేవాడు.

"నక్షత్రాలంటే?" సరోతి అడిగింది.

"అవి రాత్రిళ్ళు వస్తాయి. చెప్పినా నీకు అర్థంకాదు" నిట్టూర్చాడు.

"రాత్రి?"

"మీరు వేడి అనేది పగలు. చల్లదనం అనేది రాత్రి. మీరు రాత్రుళ్ళు పనిచేసి, పగలు నిద్రపోతారు."

అతను సూర్యుడి గురించి, సూర్యోదయ, సూర్యాస్థమయాల గురించి వివరించాడు.

"నువ్వు చెప్పేది అర్థ కాకపోయినా వింటానికి బావుంటాయి." నవ్వింది.

"ఇవన్నీ చెప్తూంటే నువ్వు నన్ను మూర్ఖుడినని అనుకోవడం లేదుగా?"

"లేదు. వినడానికి అవి సరదాగా ఉంటాయి."

"ఐతే నన్ను పెళ్ళి చేసుకుంటావా? అడిగాడు.

"చేసుకుంటాను. మా నాన్నగారితో మాట్లాడతాను" సరోతి చెప్పింది.

"ఒద్దు. అతను మూర్ఖుడు. అవయవాలు సరిగ్గా లేవు. ఇంకా చాలా నేర్చుకోవాలి" తండ్రి ఇష్టపడలేదు.

"కానీ నాన్నగారు. అతను అందరికన్నా మంచివాడు. దయగలవాడు. నన్ను ఇష్టపడుతున్నాడు. నాకు అతన్ని చేసుకోవాలని ఉంది" సరోతి కోరింది.

"సరే, అతనిలోని మూర్ఖత్వం, పిచ్చిమాటలకి గల కారణాన్ని ఆలోచించాను. దానికి చికిత్స చేయచ్చు. అతను తన కళ్ళ గురించి మాటిమాటికీ చెప్తూంటాడు. అవి సరిగ్గా ఏర్పడలేదు. బయటకి పొడుచుకు వచ్చాయి. దానివల్ల అతని మెదడు ఎదగలేదు. చిన్న కోతతో తొలగించి, మనందరికీ వెళ్ళినట్లుగా అవి లోపలికి వెళ్ళేలా చేస్తే అతను మనలా మారచ్చు" ఆయన చెప్పాడు.

"అయ్యబాబోయ్. ఒద్దు" సరోతి ఆ సంగతి చెప్పగానే నూనెజ్ అరిచాడు.

"కానీ అందువల్ల మన పెళ్ళి జరుగుతుంది" సరోతి గుర్తుచేసింది.

"నీకు అర్థం కావడంలేదు సరోతి. నా ప్రపంచం చూపు. అంత విలువైన చూపుని పోగొట్టుకోమంటావా? చూట్టానికి ఎన్నో అందమైనవి ప్రపంచంలో ఉన్నాయి. పూలు, ఆకాశం, రంగులు, మేఘాలు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు. నిన్ను చూడటానికైనా నాకు కళ్ళు అవసరం."

"ఇవన్నీ నీ ఊహే అని నాకు తెలిసినా వీటిని వినడానికి నాకు ఆనందంగా ఉంటుంది బగోటా" ఆమె నవ్వుతూ చెప్పింది.

"కానీ ఇవన్నీ నిజమైనవి."

"కాదు. నీ కళ్ళని వాళ్ళు కోసేస్తే ఈ పిచ్చి ఊహలు నీలో మాయమవుతాయి. ఆ తర్వాత మనం శాశ్వతంగా కలిసి జీవించవచ్చు" ఆమె ఏడుపు గొంతుతో అర్థించింది.

"నీకు అది ఇష్టమా?" అడిగాడు.

"నీకు ఇష్టమైతేనే" సరోతి నెమ్మదిగా చెప్పింది.

"సరే."

"ధైర్యంగా ఉండు. రేపే అది" చెప్పి ఆమె వెళ్ళిపోయింది.

అతను ఆలోచించుకున్నాడు. తన విలువైన కళ్ళతో సృష్టిలోని అందాలని చూడాలని ఉంది. రంగురంగుల ఆ సౌందర్యాన్ని తాగే కళ్ళు లేకపోతే నీటిలోని నీలం రంగుని, గడ్డిలోని ఆకుపచ్చరంగుని, సూర్యాస్థమయ సమయంలోని ఆరెంజ్ రంగుని ఎలా చూడగలడు? అతను రెండోసారి పారిపోయి ఆ రాళ్ళని చేరుకుని ఎక్కసాగాడు. ఎండవల్ల మంచు అనేక రంగుల్లో కనిపించింది. పర్వతారోహణలో అనుభవం గల తను మంచులో దారి చేసుకుంటూ పైకి ఎగబాకసాగాడు. చాలా పైకి ఎక్కాక కిందకి చూస్తే ఆ లోయ కనిపించింది.

వాన్ నూనెజ్ చెప్పేది ఇబారా ఆసక్తిగా వింటున్నాడు.

"అలా ఆ మంచు మీద ఎన్నినెలలు ఎక్కానో తెలియదు. మొత్తానికి పైకి చేరుకోగలిగాను. ఆ చలిని, ఆకలిని ఎలా తట్టుకుని జీవించానో నాకే తెలీదు. చివరికి ఇక్కడికి చేరుకోగలిగాను. నేను ఆ గుడ్డివాళ్ళ దేశం నించి ఇక్కడికి వచ్చాను."

"నీది కష్టంతో కూడుకున్నదే అయినా చాలా మంచి అనుభవం" ఇబారా చెప్పాడు.

"అవును. కష్టంతో కూడుకున్నది."

"తిరిగి వచ్చినందుకు విచారంగా ఉందా నూనెజ్?"

"లేదు."

"నా వెంట నడు. నీకు ఆహారం అవసరం. బాగా నీరసంగా ఉన్నావు. కావాలంటే నా చేతిని అందుకో" ఇబారా చెప్పాడు.

"కానీ అదెక్కడుంది సెన్యూర్ ఇబారా?"

"అదేమిటి?" ఇబారా అదిరిపడ్డాడు.

"ఆ లోయలోకి అడుగుపెట్టిన నా మీద కొండదేవతలు తమ పగని తీర్చుకున్నారు. నెలలపాటు నేనా మంచు మధ్య ఉండటంతో, మంచు తప్ప మరేం కనపడకపోవడంతో గుడ్డివాడిని అయ్యాను" వాన్ నూనెజ్ బలహీనంగా చెప్పాడు.

**(వచ్చేనెల మరోకథ)**

Post your comments